క్లుప్తంగా

12న ఓంకార్ శత జయంతి



వరంగల్ చౌరస్తా : మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంసీపీఐ(యూ) నగర నాయకులు నర్ర ప్రతాప్, ఐతమ్ నాగేష్‌లు తెలిపారు. శనివారం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఓంకార్ భవన్‌లో శత జయంతికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాలి ప్రభాకర్, అప్పనపురి నరసన్న, జటబోయిన నర్సయ్య, రాయినేని ఐలన్న, మల్లికార్జున్, శివ పాల్గొన్నారు.

క్రిస్టియన్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో శనివారం గ్రేటర్ వరంగల్ క్రిస్టియన్ ఫెలోషిప్ జనరల్ బాడీ సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక, పదవీ స్వీకార సమర్పణ కార్యక్రమాన్ని ప్రార్థనాత్మక వాతావరణంలో నిర్వహించారు. అధ్యక్షుడు పాల్ ముస్తఫా, బిషప్ డేనియల్ కళ్యాణపుల నాయకత్వంలో ఎన్నికలు ఏకాభిప్రాయంతో నిర్వహించినట్లు వెల్లడించారు. అధ్యక్షుడిగా ప్రవీణ్ ప్రభు సుధీర్, ఉపాధ్యక్షులుగా కాకిలేటి అబ్రహం, లోయిన్ జాన్‌బన్నీ ,ప్రధాన కార్యదర్శిగా జాన్సన్ ప్రసాద్, కార్యదర్శిగా సుప్రియా సర్వేశ్, సహాయ కార్యదర్శులుగా అశోక్‌పాల్, సీతయ్య పోలేపాక, ప్రవీణ్ జాన్, కోశాధికారిగా ఎన్.పావని, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గం క్రైస్తవ సమాజానికి ఆశాజ్యోతి లాంటిదిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బార్‌కు అనుమతి ఇవ్వొద్దు

హసన్‌పర్తి : ఎర్రగట్టు జంక్షన్ వద్ద కొత్త రెస్టారెంట్ అండ్ బార్ అనుమతి ఇవ్వొద్దని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం జనవాసాల మధ్య బార్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు కోరగా ఎమ్మెల్యే నాగరాజు స్పందించి ఎక్సైజ్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించాకే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు.

వీరజవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి



న్యూశాయంపేట : దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడని భారతీయ ఖేల్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు ఒక ప్రకటనలో అన్నారు. మురళీనాయక్‌కు వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

హసన్‌పర్తి: దేశ రక్షణంలో వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మశాంతికై కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శనివారం రాత్రి ఎర్రగట్టు గుట్ట జంక్షన్ వద్ద మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణాల అందజేత



మడికొండ : బంగారు ఆభరణాలను పోగొట్టుకున్న మహిళకు మడికొండ పోలీసులు అప్పగించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మడికొండ సీఐ కిషన్ కథనం ప్రకారం. కాజీపేట మండలం మడికొండకు చెందిన బండారి రాధిక వ్యక్తిగత పనుల నిమిత్తం మడికొండ నుంచి హనుమకొండకు శనివారం ఉదయం 11 గంటలకు ఆటోలో వెళ్లి ఆటో దిగిన తర్వాత తన పర్సును ఆటోలో మచిచిపోయినట్లు గమనించింది. పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు గోవర్ధన్, శ్రవణ్‌లను అప్రమత్తం చేయగా ఆటోను గుర్తించి పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను స్వాధీనపరచుకుని మహిళకు అప్పగించినట్లు తెలిపారు. పర్సులో 2 తులాల బంగారు గొలుసు, చెవి కమ్మలు రూ.2 లక్షల విలువుంటాయని తెలిపారు. మడికొండ పోలీసులకు రాధిక కృతజ్ఞతలు తెలిపింది.

బయట వాహనం పెడితే మాయం

- రెక్కి వేస్తారు. క్షణాల్లో చోరీ చేస్తారు
- వ్యసనాలకు బానిసలైన యువత
- మాయం అయితే రికవరీ కష్టం
- జాగ్రత్తలు అవసరమంటున్న పోలీసులు



వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై షాపులు, ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ఖిలా వరంగల్ : నగరంలోని రద్దీ మార్గాలు, శివారు కాలనీలను ఎంచుకొని వాహనచోరులు రెచ్చిపోతున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా వాహన చోరీలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసై యువత నిలిపి ఉంచిన బైక్, ఆటోను రెప్పపాటులో మాయం చేస్తున్నారు. ఈ ఘటనలు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌తో పాటు వరంగల్ ట్రైసిటీ వ్యాప్తంగా గత కొన్నాళ్లుగా ఎక్కువగా జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఇంటి ఎదుట నిలిపి తర్వాత రోజు ఉదయం చూసే సరికే వాహనాలు చోరీకి గురవుతున్నాయి. సామాన్య ప్రజలు కష్టార్జితంతో కొనుగోలు చేసిన వాహనాలు పోతుండటంపై బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలంటే రూ.లక్ష పైగా వెచ్చించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పట్టపగలే మాయం..

ఇటీవల కాలంలో వరంగల్ తూర్పు, శివనగర్, కరీమాబాద్, ఫోర్ట్‌రోడ్డు, చింతల్, శాంతినగర్, మిల్స్‌కాలనీ, తెలంగాణ జంక్షన్ రహదారులపై ద్విచక్ర వాహనాలు ఎక్కువగా మాయం అవుతున్నాయి. ట్రైసిటీకి గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు నగర ప్రజలు వివిధ అవసరాల కోసం షాపింగ్‌కు వస్తుంటారు. ఇటీవల కాలంలో రద్దీగా ఉండే ప్రాంతాలను దొంగలు ఎంచుకుని చోరీలకు తెగపడుతున్నట్లు బాధితులు తమ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

ఖరీదైన బైక్‌లపై కన్ను..

యువకులు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేసిన ఖరీదైన బైకులపై దొంగలకు కన్ను పడింది. వాటిని దొంగిలించి వేరొకరికి విక్రయించడం లేదా ఇతర ప్రాంతాలకు తరలించడం చేస్తున్నారు. లేదంటే వాహనాన్ని విడి భాగాలను చేసి రాత్రికి రాత్రే స్క్రాప్‌కు అమ్మేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాత్రి వేళలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. పోలీసుల గస్తీ తక్కువగా ఉండటంతోనే దొంగలు చెలరేగిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని చోరీలు ఇలా..

- వరంగల్ కరీమాబాద్‌లో ఓ వ్యక్తి సాయంత్రం ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌కు లాక్ చేసి ఇంట్లో నిదిరించాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికే బైక్ కనిపించలేదు.
- శివనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంటి ఎదుట పార్కింగ్ చేసి నిద్రించాడు. ఉదయాన్నే లేచిచూస్తే బైక్ మాయమైంది.

జాగ్రత్తలు తప్పని సరి..

వాహనం మాయమైన తర్వాత పోలీసులను ఆశ్రయించడం కంటే ఎవరికి వారు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. వాహనానికి ఉండే తాళంతో పాటు చక్రాలకూ తాళాలు వేస్తే కొంత వరకు ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాదు తాళం పడిందో లేదో ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి. ముఖ్య ఇంటి ముందు వాహనం పార్కింగ్ చేస్తే కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. దీనిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి వాహనాలను గుర్తించేందుకు తరచూ తనిఖీలు చేపడుతున్నాం. ఇటీవల కాలనీల్లో నిఘా పెంచాం. షాపులు, ఇంటి ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం.

అదనంగా టీఏల చెల్లింపు

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా సంక్షేమ శాఖలోని బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లకుండానే ట్రావెలింగ్ అలవెన్స్ (టీఏ)లు అదనంగా తీసుకున్నారని డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ (డీటీఓ) విచారణలో వెల్లడైంది. 2023 ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు 8 మంది సిబ్బంది కలిసి రూ.1,45,110 ఎక్కువ తీసుకున్నారని, ఆ డబ్బులు తిరిగి సిబ్బంది నుంచి రికవరీ చేయాలని జిల్లా సంక్షేమ విభాగాధికారికి పంపించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలంటూ జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారికి ఆమె ఆదేశాలిచ్చారు. వర్క్‌డాన్‌లు సమర్పించినా కూడా.. ఒక్క అకౌంటెంట్‌తోపాటు మరొకరు ఇచ్చిన వివరణ ఆధారంగానే డీటీఓ కనీసం బాలరక్ష భవన్ కార్యాలయానికి రాకుండానే, క్షేత్రస్థాయి విచారణ చేయకుండానే ఎక్కువ డబ్బులు డ్రా చేశారని తేల్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. 2023 ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు పనిచేసిన డీడబ్ల్యూఓ, ప్రస్తుతం జిల్లా సంక్షేమ విభాగంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది సమర్పించిన వర్క్‌డాన్‌లు తదితర వివరాలు పరిశీలించాకే వారికి టీఏలు మంజూరయ్యాయి. వీరిలో ఒక అధికారి ఇప్పుడు అదే కార్యాలయంలో ఉన్నా కూడా ఆయన కిమ్మనకుండా ఉండడం గమనార్హం. అసలు వారు ట్రావెలింగ్ అలవెన్స్ ఏ విధంగా ఇచ్చారో విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

అద్దాలు తీసి చూడు.. అభివృద్ధి కనిపిస్తుంది

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై మండిపడ్డ ఎమ్మెల్యే నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్‌పర్తి : ధృతరాష్ట్రుడిలా నల్లటి కళ్లద్దాలు పెట్టుకుని మాట్లాడకు.. జర ఆ అద్దాలు తీసి చూడు అభివృద్ధి–సంక్షేమం కనిపిస్తుందని మాజీ మంత్రి దయాకర్‌రావుపై ఎమ్మెల్యే నాగరాజు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేదని, సన్నధాన్యాలు కొనుగోలు చేయడం, బోనస్ ఇవ్వడం లేదని దయాకర్‌రావు వ్యాఖ్యానించడంపై ఎమ్మెల్యే స్పందించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి ఇంట్లో శనివారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు అన్ని సెంటర్లలో ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఇప్పటికీ ఈవిషయం మాజీ మంత్రికీ తెలియదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి దయాకర్‌రావులకు బోనస్ రాకుంటే ఎవరికీ రానట్లా అని ప్రశ్నించారు. బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మధన్‌గౌడ్, భగత్, శ్రీరాం,దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

బీసీల విద్యాస్థాయిని పెంచాలి



రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ మురళికి నివేదికను అందజేస్తున్న బీసీ నాయకులు, కేయూ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : బలహీనవర్గాల విద్యాస్థాయిని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ అకునూరి మురళికి బీసీ నాయకులు ,కేయూ అధ్యాపకులు డాక్టర్ తిరుణహరిశేషు, డాక్టర్ టి.నాగయ్య శనివారం తెలిపారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్ కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన స్టేటస్ ఆఫ్ బీసీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేయూ నుంచి పాల్గొన్న తిరుణహరిశేషు, నాగయ్య రాష్ట్రంలో బీసీల విద్యాస్థాయి, విద్యావిషయాల్లో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు విద్యాస్థాయిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక అందజేసినట్లు వారు తెలిపారు. ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్య, ప్రొఫెషనల్ ,సాంకేతిక విద్యలలో బీసీల విద్యార్థుల స్థాయిని పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై కమిషన్‌కు నివేదిక అందజేశామని వారుతెలిపారు. ముఖ్యంగా బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని సూచించామన్నారు. రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ వివిధ వర్గాలనుంచి వచ్చిన సూచనలను క్రోడీకరించి బలహీనవర్గాల విద్యాస్థాయిని పెంచేందుకు కమిషన్ పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుందని తెలియజేశారని వారు తెలిపారు.

ఎన్‌సీసీ ఆర్మీ విభాగం కేడెట్లకు అభినందన



కేయూ క్యాంపస్ : హసన్‌పర్తిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఈనెల 1 నుంచి 10 వరకు 10వ బెటాలియన్ ఎన్‌సీసీ వారు నిర్వహించిన ఏటీసీ వార్షిక శిక్షణ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి ఎన్‌సీసీ ఆర్మీ విభాగం కేడెట్స్ పాల్గొని విచ్చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారిలో సాయిచందన, జీవన్‌కుమార్, ఉత్తమ డ్రిల్‌లో వెంకటరమణ, టగ్ ఆఫ్ వార్‌లో మొదటి స్థానం సాధించిన స్రవంతి, వెంకటరమణ, మౌ ని క తదితరులున్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, ఎన్‌సీసీ ఆర్మీ విభాగం అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి అభినందించారు.

సైన్యానికి అండగా 140 కోట్ల ప్రజలు

- బీజేపీ సీనియర్ నేత, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి

హన్మకొండ : భారత సైన్యానికి అండగా 140 కోట్ల ప్రజలు ఉన్నారని బీజేపీ సీనియర్ నాయకుడు, జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన సంఘటన, సంరచన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన ఆదేశాల నియమాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీని పోలింగ్ బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని అన్నారు. బీజేపీకి రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్నింటిలో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్, కాచం గురుప్రసాద్, దాస్యం అభినవ్‌భాస్కర్, కూతురు రాజు, నర్మెట శ్రీనివాస్‌రావు, మండల డివిజన్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో కార్మికులు

నయీంనగర్ : ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అంబేడ్కర్ జంక్షన్ ఆటో అడ్డా, రాంనగర్ ఆటో అడ్డా కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ట్రాన్స్‌పోర్ట్ రంగం హనుమకొండ జిల్లా కన్వీనర్ ధరావత్ భాను నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 100 ఏళ్ల క్రితం బ్రిటీష్ ప్రభుత్వంతో కొట్లాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ గతంలో ఉన్న 40 రకాల కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల స్వేచ్ఛ స్వతంత్రాన్ని హరిస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల కపట నాటకంతో వ్యవహరిస్తూ వారి హక్కుల కోసం మాట్లాడకుండా మోసం చేస్తోందన్నారు. మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని నాలుగు కోడ్‌లను వెనక్కి తీసుకునే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సంపత్, శ్రీనివాస్, మంజు నాయక్, సీతారాం, బాలు, కీమా తదితరులు పాల్గొన్నారు.

సైన్ బోర్డుల తొలగింపు



వరంగల్ అర్బన్ : నగరంలోని ప్రధాన రహదారుల్లో ఇరువైపులా ఉన్న సైన్ బోర్డుల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం రాంపూర్ నుంచి కాజీపేట వరకు సుమారు 500 మేర తొలగించినట్లు బల్దియా ఏసీపీ తెలిపారు. రోడ్డు ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లో ఉన్న సైన్ బోర్డుల తొలగింపు కొనసాగుతోంది. కాజీపేట వరకు మెయిన్ రోడ్డులో సుమారు 500 సైన్ బోర్డులను శనివారం తొలగించినట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇర్షాద్ తెలిపారు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో సైన్‌బోర్డులు, ప్రకటనల బోర్డులు తొలగించనున్నట్లు తెలిపారు. గతంలో పలుమార్లు తొలగించాలని నోటీసులు జారీ చేసినా యాజమానులు, వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో టీపీఓ రజిత, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, అవినాష్, రోజారెడ్డి, డీఆర్ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల చేయూత


కాజీపేట: దర్గా కాజీపేట ప్రగతి రిటైర్డ్ ఉద్యోగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధీనబంధు సేవా సంస్థ 55 మంది నిరుపేదలకు చీరలు, రూ.100 నగదు, పెరగన్నం ప్యా కెట్లు, బ్రెడ్, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేసింది. నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కేశవరావు, రామారావులు పేదలకు సాయం అందజేశారు. సంఘం అధ్యక్షులు సమ్మయ్య, కార్యదర్శి కె.రామదాసు, రాజమోహన్, గట్టయ్య, భాస్కర్, జలీల్‌ఖాన్, పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

కాజీపేట : ఆటోలో మరిచిపోయిన బ్యాగును తిరిగి బాధితుడికి అందించి ఓ ఆటోడ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. శనివారం మధ్యాహ్నం ములుగు జిల్లా పస్రాకు చెందిన దీపక శ్రీరామ్ ఫాతిమానగర్ అడ్డాపై ఆటోలో ఎక్కి హనుమకొండ బస్టాండ్‌లో దిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఆటోలో బ్యాగు కనిపించడంతో ఆటో డ్రైవర్ బెడిగా జగదీశ్వర్ నేరుగా ఫాతిమానగర్ అడ్డాపై విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అప్పగించాడు. బ్యాగులో ఉన్న సమాచారం మేరకు బాధితుడికి ఫోన్ చేసి రప్పించి ట్రాఫిక్ ఎస్సై రావెళ్ల రామారావు చేతుల మీదుగా బ్యాగును అందజేశారు. బ్యాగులో రూ.2 వేల నగదు, విలువైన కాగితాలు ఉన్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్‌ను ఎస్సై అభినందించారు.

నేడు అయ్యప్ప ధర్మ ప్రచార సభ సమావేశం

హన్మకొండ కల్చరల్ : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ తెలంగాణ రాష్ట్ర వార్షికోత్సవ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నామని ప్రచారసభ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దుశెట్టి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్ వద్ద ఉన్న సురభి బాంకెట్ హాల్‌లో జరిగే సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాకు చెందిన కార్యవర్గసభ్యులు హాజరుకానున్న తెలిపారు.



సంక్షిప్త సమాచారం

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



హసన్‌పర్తి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆరోపించారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. సామాజిక భద్రత నుంచి తప్పకుని కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌లను కఠినతరం చేసి సొసైటీలను రద్దు చేసేందుకు బీజేపీ సర్కార్ యోచిస్తోందని ధ్వజమెత్తారు. ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకుంటుంది



నయీంనగర్ : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సుదీర్ఘ కాలం అనేకమంది అనేక త్యాగాలు చేశారని వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ స్పష్టం చేశారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల సదస్సుకు రియాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యమకారులని గుర్తించి వారి ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఉద్యమకారులకు త గిన న్యాయం జరిగే విధంగా సీఎం దృష్టికి తీసుకెళుతానన్నారు.

ఇండియా విజేతగా నిలవాలని పూజలు



కాజీపేట: గ్రేటర్‌లోని 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామి దే వాలయంలో శని వారం పాకిస్తాన్‌ను ఓడించి ఇండియా విజేతగా నిలువాలని ఆకాంక్షిస్తూ భక్తులు ప్రత్యేక పూ జలు చేశా రు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హనుమా న్‌కు అభిషేకాలు, అర్చనలు చేసి వడమాల, తమలపాకులు, పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

సింధూర్ విజయానికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్ : సింధూర్ విజయానికి వరంగల్ 41వ డివిజన్ విశ్వనాథ కాలనీకి చెందిన ప్రజలు శనివారం కర్నె రవీందర్ ఆధ్వర్యంలో జాతీయ జెండా పట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతదేశం, పాకిస్తాన్‌కి జరుగుతున్న బీకర యుద్ధంలో భారత్ విజయం సాధించాలని, సైన్యానికి మరింత శక్తినివ్వాలని కోరుతూ వాయుపుత్రుడైన శ్రీఅభయాంజనేయస్వామికి విశేషపూజలు నిర్వహించామని రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసుదేవ్, భక్తులు పాల్గొన్నారు

భారతసైన్యానికి చిన్నారుల వందనం

హన్మకొండ కల్చరల్ : ఉమ్మడి జిల్లాల వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా హనుమకొండ నక్కలగుట్టలోని వికాసతరంగిణి కార్యాలయంలో విద్యార్థులు పాల్గొని భారతసైన్యానికి అభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైనికులకు సెల్యూట్ చేస్తూ వినాదాలు చేస్తూ దేశభక్తి పాటలు పాడుతూ దేశం కోసం వీరమరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రజ్ఞ టీచర్లు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు అవార్డులు

కాజీపేట అర్బన్ : పదో తరగతి, ఇంటర్‌లో మెరిట్ సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గౌడ విద్యార్థులకు ఈనెల 18న హంటర్‌రోడ్డులోని గౌడ హాస్టల్ భవనంలో అవార్డులను అందజేయనున్నట్లు గోపా జిల్లా ఇంచార్జి చిర్రరాజుగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9963417910 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

భిక్షపతి ఆశయాలను కొనసాగిద్దాం

కాజీపేట అర్బన్ : అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపకుడు బండి భిక్షపతి ఆశయాలను కొనసాగిద్దామని ప్రొఫెసర్ ఎస్ఎ.మాలిక్ తెలిపారు. హన్మకొండ అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం భిక్షపతి 15వ వర్ధంతి సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భిక్షపతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

500 మంది హనుమాన్ భక్తులకు భిక్ష



హన్మకొండ అర్బన్ : హనుమకొండ పద్మాక్షి రోడ్డులోని హనుమద్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో శనివారం హనుమాన్ మాలధారులైన 500 మంది భక్తులకు భిక్షను ఏర్పాటు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశా రు. కమిటీ సభ్యులు గందె కృష్ణ, రవికుమార్, ధశరథ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.